క్లుప్తంగా

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్



గోవిందరావుపేట: పస్రా పోలీస్‌స్టేషన్ పరిధిలోని రౌడీ షీటర్లకు, పాత నేరస్తులకు ఎస్సై కమలాకర్ సోమవారం కౌన్సెలింగ్ ఇచ్చారు. స్టేషన్ పరిధిలోని రౌడీషీటర్లను, గతంలో నేరం చేసి మళ్లీ తప్పు చేసే అవకాశం ఉన్న వ్యక్తులను స్టేషన్‌కు పిలిపించి మాట్లాడారు. ఎస్సై వారి పూర్తి వివరాలు సేకరించారు. ప్రస్తుతం వారు ఎక్కడ ఉంటున్నారు, ఏమి చేస్తున్నారు అనే విషయాలను కూలంకశంగా అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ నేర ప్రవృత్తి వదిలేసి సత్ప్రవర్తనతో మెలగాలని వారికి సూచించారు. రౌడీ షీట్, సస్పెక్ట్ షీట్ కలిగిన వారి మీద పోలీస్ నిఘా ఎప్పటికి ఉంటుందని అన్నారు.

పేకాట స్థావరాలపై దాడి



గోవిందరావుపేట: మండలంలోని నేతాజీనగర్‌లో పలువురు పేకాట ఆడుతున్నారనే పక్కా సమాచారంతో సోమవారం పస్రా ఎస్సై కమలాకర్ తన సిబ్బందితో కలిసి ఆకస్మిక దాడులు నిర్వహించారు. వీరిలో నలుగురిని అదుపులోకి తీసుకోగా మరో ఆరుగురు పరారీలో ఉన్నారని ఎస్సై తెలిపారు. పట్టుకున్న నిందితుల్లో నేతాజీనగర్‌కు చెందిన వంక సురేష్, కొప్పుల సాయితేజ, రూప్‌సింగ్, పస్రాకు చెందిన గార్ల శ్రీనివాస్ ఉండగా వారి నుంచి రూ. 12,600 నగదును, 2 బైక్‌లను, 4 సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు.

రైతులకు త్వరగా రుణాలివ్వండి



వాజేడు: రుణమాఫీ పొందిన రైతులకు త్వరగా రుణాలను ఇవ్వాలని ఏటూర్‌నాగారం ఏడీఏ శ్రీధర్ అన్నారు. సోమవారం బ్యాంకులను, సొసైటీకి సిబ్బందితో వచ్చిన ఆయన రైతుల ఖాతాల్లో రుణమాఫీ డబ్బులు నమోదు అయింది లేనిది పరిశీలించారు. రుణమాఫీ వచ్చిన రైతులకు బ్యాంకులు తమ నిబంధనల ప్రకారం రెన్యువల్ చేసి త్వరగా రుణాలను ఇవ్వాలని తెలిపారు. అందుకు రైతులు కూడా బ్యాంకు అధికారులు తెలిపిన ధ్రువీకరణ పత్రాలను ఇవ్వాలని సూచించారు. ఆయన వెంట ఏఓ నర్సింహారావు, ఏఈఓలు జాఫర్, రాధిక ఉన్నారు.

రామప్ప పర్యాటకుడికి గుండెపోటు



వెంకటాపురం(ఎం): మండలంలోని చారిత్రాత్మక రామప్ప దేవాలయాన్ని సోమవారం హైదరాబాద్‌కు చెందిన రాజు తన భార్యతో కలిసి సందర్శించారు. ఆలయాన్ని సందర్శించి తిరుగు వెళ్తున్న క్రమంలో పాలంపేట బస్టాండ్ వద్ద గుండెపోటుకు గురయ్యాడు. దీంతో అటుగా వెళ్తున్న బీఆర్‌ఎస్ జిల్లా నాయకుడు మల్క రమేష్ గమనించి వెంటనే రాజును తనకారులో ములుగు జిల్లా ఆస్పత్రికి తరలించారు. రాజును పరీక్షించిన వైద్యులు సమయానికి తీసుకరావడంతో ప్రాణాపాయం తప్పిందన్నారు. ఈ సందర్భంగా పాలంపేట గ్రామస్తులు, పర్యాటకులు రమేష్‌ను అభినందించారు.

పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్య

వెంకటాపురం(కె) : మండలంలోని వీరభద్రవరం గ్రామంలో పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన సోమవారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం ..గ్రామానికి చెందిన మునిగెల శ్రీనివాస్(55) మద్యానికి బానిసై రోజు కుటుంబ సభ్యులతో గొడవ పడుతున్నాడని తెలిపారు. మద్యం సేవించవద్దని కుటుంబ సభ్యులు మందలించడంతో మద్యం మత్తులో ఇంట్లో ఉన్న పురుగుల మందు తాగి ఆత్యహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు వెంకటాపురం వైద్యశాలకు తరలించేలోపే మృతి చెందినట్లు తెలిపారు. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు ఎస్సై తిరుపతిరావు కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నారు.

పెరుగుతున్న గోదావరి వరద

- భద్రాచలం, వెంకటాపురం, చర్ల–వెంకటాపురం మండలాల మధ్య నిలిచిన రాకపోకలు



వాజేడు : వాజేడు వద్ద రహదారిపై ఉధృతంగా ప్రవహిస్తున్న గోదావరి

వాజేడు: మండలంలోని పేరూరు వద్ద గోదావరి వరద క్రమేపీ పెరుగుతోంది. ఆదివారం సాయంత్రం గోదావరి నీటిమట్టం 15.85 మీటర్లు ఉండగా సోమవారం సాయంత్రం 7 గంటలకు 17.30 మీటర్లకు చేరుకుంది. ఎగువ ప్రాంతం నుంచి వరద నీరు వస్తుండటంతో గోదావరి పెరుగుతున్నట్లు సీడబ్ల్యూసీ సిబ్బంది తెలిపారు. దీనికి తోడు మండలంలో కురిసిన వర్షాలకు వాగులు వంకలు పొంగి ప్రవహిస్తున్నాయి. మండలంలోని పూసూరు–ఎడ్జర్లపల్లి, వాజేడు–గుమ్మడిదొడ్డి, పేరూరు–చంద్రుపట్ల, కోయవీరాపురం, రహదారులపై గోదావరి వరద ప్రమాదకరంగా ప్రవహిస్తోంది. మండల పరిధిలోని టేకులగూడెం చివరన రేగుమాక ఒర్రెవద్ద తెలంగాణ, చత్తీస్‌గడ్ రహదారిపైకి చేరిన గోదావరి వరద ఉధృతంగా ప్రవహిస్తుంది. మండల ప్రత్యేకాధికారి సర్దార్ సింగ్, తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీఓ విజయ, ఎంపీఓ శ్రీకాంత్ నాయుడు, ఆర్ఐ కుమారస్వామి, డీటీ రాహుల్‌చంద్ర వర్మ వరద పరిస్థితిని పరిశీలించారు.

పునరావాస కేంద్రాలకు 27 మంది తరలింపు

గోదావరి వరద ఉధృతంగా పెరగడంతో ముందస్తు చర్యల్లో భాగంగా 8 కుటుంబాలకు చెందిన 21 మందిని అధికారులు పునరావాస కేంద్రాలకు సోమవారం తరలించారు. మండలంలోని నాగారం బీసీ కాలనీలోని నాలుగు కుటుంబాలకు చెందిన 20 మందిని, గుమ్మడిదొడ్డి ఎస్సీ కాలనీలోని నాలుగు కుటుంబాలకు చెందిన ఏడుగురిని పునరావాసా కేంద్రాలకు తరలించారు. నాగారంలోని బీసీ కాలనీలో ఉన్న చర్చి వరద నీటిలో మునిగింది. చర్చిపల్లపు ప్రదేశంలో ఉండడంతో చర్చి లోకి వరద నీరు వచ్చి చేరింది. బొగత జలపాతం సమీపంలో గోదావరి మధ్యలో ఉన్న త్రీ ఫేస్ విద్యుత్ లైన్ ఇన్సలేటర్ పగిలిపోయింది. దీంతో విద్యుత్ సమస్య తలెత్తకుండా ఏఈ అర్షద్ అహ్మద్, జేఎల్‌ఎంలు వంశీ, రాజేందర్ పడవలో వెళ్లి మరమ్మతులు చేపట్టారు.



వెంకటాపురం(కె) : బోదాపురం వద్ద వంతెన పైకి చేరిన వరద నీరు



వాజేడు: వరద నీటిలో చర్చి

రాకపోకల నిలిపివేత

వెంకటాపురం(కె): గోదావరి వరద ఉధృతి పెరగటం వల్ల భద్రాచలం, వెంకటాపురం మండలాల మధ్య వాగుల్లోకి, రోడ్లపైకి గోదావరి వరదనీరు చేరింది. కాగా మండల పరిధిలోని కొండాపురం, వీరభద్రవరం, బోదాపురం వద్ద రోడ్లపైకి వరద నీరు చేరి రాకపోకలు నిలిచిపోయాయి. భద్రాచలం వెళ్లే ప్రయాణికులు ఏటూరునాగారం, వయా మణుగూరు మీదుగా వెళ్లాలని ఎస్సై కొప్పుల తిరుపతిరావు తెలిపారు. సోమవారం చర్ల, వెంకటాపురం మండలంలోని వాగులు వంకలు పొంగడంతో పాటు గోదావరి వరద పరవళ్లు తొక్కటంతో మండలం జలదిగ్బంధంలో ఉంది. బొదాపురం, కుక్కతొగువాగు, వాగుల వద్ద వరద నీరు ఉధృతంగా ప్రమాదస్థాయిని మించి ప్రవహిస్తుండడంతో మండలానికి రాకపోకలు పూర్తిగా స్తంభించిపోయాయి.

బాధిత కుటుంబాలకు మంత్రి పరామర్శ



పూజారి ముత్తయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మంత్రి సీతక్క

ఎస్ఎస్‌తాడ్వాయి: మండలంలోని మేడారం కాలనీకి చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు ఆల్లకుంట రమేష్, మేడారం గ్రామానికి చెందిన సమ్మక్క పూజారి(వడ్డె) మల్లెల ముత్తయ్య, కొత్తూరు గ్రామానికి చెందిన దొంతుల రాంరెడ్డి కుటుంబాలను పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క సోమవారం పరామర్శించారు. వారి చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాధిత కుటుంబాలకు పార్టీ ఎలవేళలా అండగా ఉంటుందని మంత్రి భరోసానిచ్చారు. ఆమె వెంట మేడారం జాతర చైర్మన్ అరేం లచ్చుపటేల్, పీఏసీఎస్ చైర్మన్ పులి సంపత్‌గౌడ్ , గౌరవ మండల అధ్యక్షుడు జాలపు అనంతరెడ్డి , మాజీ ఎంపీటీసీ బత్తిని రాజుగౌడ్, ఎస్టీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి పీరీల వెంకన్న, మండల అధ్యక్షుడు ఇప్ప నాగేశ్వర రావు , ములుగు జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు రేగ కళ్యాణి , సీతక్క యువసేన జిల్లా అధ్యక్షుడు చర్ప రవీందర్, బీసీ సెల్ మండల అధ్యక్షుడు యాశడపు మల్లయ్య , కట్కూరి భాస్కర్‌రెడ్డి , మేడారం యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు రానా రమేష్ ఉన్నారు.

రక్తదానం.. మరొకరికి ప్రాణదానం



శిబిరంలో రక్తదానం చేస్తున్న ఎస్సై వెంకటేష్

కన్నాయిగూడెం: ఆపదలో ఉన్న వారికి రక్తదానం చేయడమంటే మరొకరికి ప్రాణదానం చేయడమే అని స్థానిక ఎస్సై వెంకటేష్ అన్నారు. సోమవారం మండలంలోని ముప్పనపల్లి గ్రామపంచాయతీ కార్యాలయంలో ముప్పనపల్లి సహాయనిధి గ్రూపు సభ్యుల ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. యువకులు స్వచ్ఛందంగా ముందుకొచ్చి 40 మంది రక్తదానం చేశారు. వారికి సహాయ నిధి ఆధ్వర్యంలో ఓఆర్ఎస్ ప్యాకెట్లు, ఫ్రూట్స్ పంపిణీ చేశారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎస్సై హాజరై రక్తదానం చేశారు. రక్తదానం చేయడానికి యువత ముందుకు రావాలని ఆయన కొనియాడారు. ముప్పనపల్లిలో ఇలాంటి కార్యక్రమం ఏర్పాటు చేయడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. గ్రూపు ప్రొడ్యూసర్ అబ్బు సతీష్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ జనగం సమ్మక్క, మాజీ సర్పంచ్ శీధరి మౌనిక, డాక్టర్ గిరి బాబు, ముప్పనపల్లి సహాయనిధి గ్రూపు సభ్యులు విజయ్, కిరణ్ ప్రవీణ్, రాజు, నాగరాజు, రాజశేఖర్, కిషోర్, శ్రీధర్, ప్రశాంత్, కాంగ్రెస్ నేతలు రాంబాబు, రమేశ్, మల్లయ్య, సుమన్ పాల్గొన్నారు.

‘పది’ విద్యార్థులకు బహుమతులు అందజేత



బిందుసాయిలతకు నగదును అందజేస్తున్న పూర్వ విద్యార్థులు, ఎస్సై, తదితరులు

ఏటూరునాగారం: స్థానిక జెడ్పీహెచ్ఎస్‌లో ఈ ఏడాది పదో తరగతిలో మొదటి, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన విద్యార్థులకు ఈ పాఠశాలలో గతంలో పనిచేసిన ఉపాధ్యాయురాలు వరలక్ష్మి చేయూత నందించారు. సోమవారం పాఠశాలలో 10 జీపీఏ సాధించిన బిందుసాయిలతకు రూ.6వేలు, పెండ్యాల చైత్రకు రూ. 5వేలు, శరణ్య, మౌలి, తేజశ్రీలకు ఒక్కొక్కరికి రూ.4వేల నగదు బహుమతులను 1986–87, 1991–92 ఎస్ఎస్‌సీ బ్యాచ్‌లకు చెందిన పూర్వ విద్యార్థుల సమక్షంలో అందజేశారు. అనంతరం పూర్వ విద్యార్థులు పెండ్యాల ప్రభాకర్, సాయిని మహేష్‌లు మాట్లాడుతూ టెన్త్ విద్యార్థులను ప్రోత్సహించేందుకు ఉపాధ్యాయురాలు ఇలాంటి ఆలోచన చేశారన్నారు. వచ్చే ఏడాది నుంచి ఎవరు టెన్త్‌లో ర్యాంకు సాధించిన నగదు బహుమతి ఉంటుందని ఆమె తెలిపినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో ఎస్సై తాజొద్దీన్, డాక్టర్ వరప్రసాద్, రమేష్, అన్నవరం వెంకటేశ్వర్లు, మోడెం చందు, బోడ సారయ్య, ఆకుల శ్రీనివాస్, పెండ్యాల సతీష్ పాల్గొన్నారు.

తపాలా సేవలను సద్వినియోగం చేసుకోవాలి



తపాలాసేవలపై అవగాహన కల్పిస్తున్న పోస్టుమాస్టర్ హరీశ్

ఎస్ఎస్‌తాడ్వాయి : తపాలా శాఖ అందించే సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఊరట్టం బ్రాంచి పోస్టుమాస్టర్ హరీశ్ అన్నారు. సోమవారం మండలంలోని ఊరట్టం, కన్నెపల్లి, కొత్తూరు గ్రామాల్లో తపాలాశాఖ సేవలపై అవగాహన కల్పించారు. తపాలాశాఖ ప్రవేశపెట్టిన సుకన్య సమృద్ధి యోజనా, రికరింగ్ డిపాజిట్, జీవిత బీమా, గ్రామీణ తపాలా జీవితా బీమా, టైం డిపాజిట్, ఫిక్స్‌డ్ డిపాజిట్, ఐపీపీబీ ఖాతాలు, ఇన్సూరెన్స్ తదితర పొదుపు ఖాతాల గురించి వివరించారు. ఈ సందర్భంగా హరీష్ మాట్లాడుతూ ప్రజలు ఎటువంటి బ్యాంకులకు వెళ్లాల్సిన అవసరం లేదన్నారు. గ్రామాల్లోని పోస్టాఫీస్‌లో జరిగే అన్ని లావాదేవీలు చేసుకోవచ్చన్నారు. పదేళ్లలోపు ఆడపిల్లలకు సుకన్య సమృద్ధి యోజనా పథకం మంచి మేలు చేస్తుందన్నారు. ఇవేకాకుండా పబ్లిక్ ప్రావిడెంట్ ఫండ్, మహిళా సమ్మాన్, సీనియర్ సిటిజన్ పథకాలు ఉన్నాయన్నారు, పోస్టాఫీస్ ఇండియా పోస్ట్ పేమెంట్స్ బ్యాంకు ఖాతా ద్వారా ఆన్‌లైన్ సేవలు ఫోన్‌పే, గూగుల్ పే వంటి సేవలు కూడా చేసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ బ్రాంచి పోస్టుమాస్టర్ భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

కూలిపోతున్న సైడ్‌వాల్



మహాముత్తారం: మండలంలోని నల్లగుంటమీనాజీపేట గ్రామంలోని కొత్తచెరువు మత్తడి సైడ్‌వాల్ కూలిపోతూ నెర్రబాసి ప్రమాదకరంగా ఉంది. గత సంవత్సరం కొద్దిగా ఉన్న బుంగ ఐదు రోజుల నుంచి కురుస్తున్న వర్షానికి చెరువు మత్తడి పడటంతో భారీగా ఏర్పడింది. ఇలాగే కొనసాగితే సైడ్‌వాల్ కూలిపోయి కట్టకోతకు గురైయ్యే ప్రమాదం ఉందని రైతులు వాపోతున్నారు. గతంలో నీటిపారుదల శాఖ అధికారులు సమాచారం ఇచ్చినప్పటికీ స్పందించలేదని రైతులు ఆరోపించారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం

చిట్యాల: మండలంలోని చల్లగరిగ గ్రామానికి చెందిన వర్ధమాన గేయ రచయిత పోతుగంటి శ్రావణ్‌కుమార్ తండ్రి వీరేశం(55) ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో బాధిత కుటుంబ సభ్యులను మిట్టపల్లి మిత్రమండలి వ్యవస్థాపక అధ్యక్షుడు పుల్ల సతీష్‌కుమార్ ఆధ్వర్యంలో సోమవారం పరామర్శించారు. అనంతరం మృతుడి చిత్రపటానికి నివాళులర్పించి, రూ.5వేల ఆర్థిక సాయం అందించారు. ఈ కార్యక్రమంలో మిట్టపల్లి మిత్రమండలి సభ్యులు మాసు రమేష్, పుల్ల శైలేందర్, కల్యాణ్, గురుకుంట్ల కిరణ్, రాయిని శ్రీకాంత్, ఉప్పుల కిరణ్, శశి, సంతోష్ పాల్గొన్నారు.

రుణమాఫీ రాలేదంటూ పడిగాపులు

- ఏఈఓను నిలదీసిన రైతులు



ఏఈఓ కల్యాణిని నిలదీస్తున్న రైతులు

కన్నాయిగూడెం: మండలంలోని బుట్టాయిగూడెం, చింతగూడెం, కన్నాయిగూడెంతో పాటు ఇతర గ్రామాల ప్రజలు తమకు రుణమాఫీ కాలేదంటూ కార్యాలయం ఎదుట రైతులు పడిగాపులు కాస్తున్నారు. ప్రభుత్వం రూ.లక్ష రుణమాఫీ చేసిన విషయం తెలిసిందే. దీంతో కొంత మంది రైతులకు రుణమాఫీ కాకపోవడంతో మొదట సంబంధిత బ్యాంకు వద్దకు వెళ్లగా మీకు ఎందుకు మాఫీ కాలేదో మాకు తెలియదు వ్యవసాయ అధికారులకే తెలుసని సమాధానం చెప్పారన్నారు. సోమవారం వ్యవసాయ అధికారుల కోసం రైతువేదిక వద్దకు వచ్చామని రైతులు చెప్పారు. ఇక్కడ కూడా సరైన సమాధానం రావడంలేదని వాపోయారు. ఎంపీడీఓ కార్యాలయం ఎదుట ఏఈఓ కల్యాణిని మాకు రుణమాఫీ ఎందుకు రాలేదని అడిగినట్లు తెలిపారు.ప్రభుత్వం అందరికి రుణమాఫీ చేయాలని కోరుతున్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



వాజేడు: వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యసిబ్బంది

కన్నాయిగూడెం: సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎంసీహెచ్ వైద్యుడు గిరి అన్నారు. మండలంలోని చిట్యాల, భూపతిపురం, గ్రామాల్లో ఆస్పిరేషనల్ బ్లాక్‌లో భాగంగా వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగా గ్రామంలో వివిధ రోగ పీడితులతో బాధపడుతున్న 108 మందికి ఓపీ చూడగా అందులో 18 మంది ఫీవర్‌తో ఉన్నారు. 18 మందికి ఆర్డీటీ పరీక్షలు చేశారు. కావలసిన వారికి మందులు పంపిణీ చేశారు. 60 మంది బలహీనతలతో ఉన్నట్లు గుర్తించినట్లు వైద్యుడు తెలిపారు. డాక్టర్ గిరి మాట్లాడుతూ మండలంలో విస్తారంగా వర్షాలు పడుతుండంతో తాగునీరు, ఆహారపదార్థాలు కలుషితమై వివిధ రోగాల బారిన పడే ప్రమాదం ఉందన్నారు.కార్యక్రమంలో ఆస్పిరేషనల్ బ్లాక్ కో ఆర్డినేటర్ రవీష్, హెల్త్ అసిస్టెంట్ లక్షణ్, ఏఎన్ఎం కవిత పాల్గొన్నారు

జ్వరం వస్తే వైద్యశాలకు రండి

వాజేడు: జ్వరం వస్తే తప్పనిసరిగా వైద్యశాలకు రావాలని ప్రగళ్లపల్లి పల్లె దవాఖాన వైద్యురాలు గ్యానస అన్నారు. మండల పరిధిలోని మొరుమూరు, కాలనీ గ్రామాల్లో సోమవారం జ్వరాలపై ఇంటింటా సర్వే నిర్వహించారు. గర్భిణులకు పరీక్షలు చేసి పలు సూచనలను చేశారు. ఈ సందర్భంగా పలువురి నుంచి రక్త నమూనాలను సేకరించారు. ఆమె వెంట సీ హెచ్‌ఓ సూర్యప్రకాష్, హెల్త్ సూపర్‌వైజర్లు కోటిరెడ్డి, వెంకట రమణ, సిబ్బంది ఉన్నారు.

ఇంటింటా ఫీవర్ సర్వే

వెంకటాపురం(కె): వైద్యసిబ్బంది మండలంలోని రామచంద్రాపురం, చిన్నగంగారం గ్రామాల్లో ఇంటింటా ఫీవర్ సర్వే నిర్వహించారు. అనంతరం గ్రామాల్లో సోమవారం వైద్యశాఖ ఆధ్వర్యంలో వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఎదిర వైద్యాధికారి భవ్యశ్రీ గ్రామస్తులకు వైద్య పరీక్షలను నిర్వహించి మందులు అందజేశారు. అనంతరం వారి వద్ద నుండి రక్త నమూనాలను సేకరించారు.

కొండాయిలో 40 మందికి పరీక్షలు

ఏటూరునాగారం: ప్రజలు వ్యాధులపై నిరంతరం అప్రమత్తంగా ఉండాలని వైద్యాధికారి ప్రణీత్ సూచించారు. మండల పరిధిలోని కొండాయిలో సోమవారం వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొండాయి గ్రామానికి చెందిన పాయం స్నేహను 108లో ఏటూరునాగారం సామాజిక ఆస్పత్రికి తరలించారు. అదే విధంగా మల్యాలకు చెందిన దబ్బగట్ల భవానిని ఎస్‌డీఆర్‌ఎఫ్ బృందం జంపన్నవాగు నుంచి ఎయిర్‌బోట్‌లో ఊరట్టం, మేడారం మీదుగా ఏటూరునాగారం సామాజిక ఆస్పత్రికి తరలించారు. ఈ వైద్య శిబిరంలో 40 మందికి పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేసినట్లు వివరించారు. జ్వర బాధితులు ఎనిమిది మంది నుంచి రక్తనమూనాల ను సేకరించినట్లు వెల్లడించారు. హెల్త్ అసిస్టెంట్ భాస్కర్ రావు, ఏఎన్ఎం సమ్మక్క, తదితరులు పాల్గొన్నారు.



కన్నాయిగూడెం: చిట్యాలలో..



వెంకటాపురం(కె) లో..



ఏటూరునాగారం : పరీక్షలు చేస్తున్న వైద్యాధికారి

పుట్టగొడుగుల పెంపకంతో అధిక ఆదాయం



మాట్లాడుతున్న ప్రత్యేక అధికారి శామ్యుల్



వంట గదిని పరిశీలిస్తున్న ప్రత్యేక అధికారి శామ్యుల్

రేగొండ: అధిక దిగుబడినిచ్చే పుట్టగొడుగుల పెంపకం ద్వారా రైతులు అధిక ఆదాయం పొందవచ్చని మండల ప్రత్యేక అధికారి శామ్యుల్ అన్నారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ భూపాలపల్లి, ఎస్‌బీఐ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ హసన్‌పర్తి వారి ఆధ్వర్యంలో పుట్టగొడుగుల పెంపకంపై పది రోజులు ఉచిత శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశానికి ముఖ్య అతిథిగా ఆయన హాజరై మాట్లాడుతూ.. అందుబాటులో ఉన్న వనరులతో తక్కువ పెట్టుబడితోనే పుట్టగొడుగుల సాగును చేపట్టవచ్చన్నారు. పుట్టగొడుగుల పెంపకంతో ఏడాది పొడవునా మంచి ఆదాయం లభిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ వెంకటేశ్వరరావు, ఏపీఓ జమీర్ పాషా, ప్రోగ్రాం ట్రైనర్ బాలస్వామి, ప్రోగ్రాం కోఆర్డినేటర్ కిషోర్, ఆర్‌సెటి శిక్షణ సంస్థ డైరెక్టర్ రవి, డీఆర్‌పీ టెక్నికల్ అసిస్టెంట్ కిషన్, ఫీల్డ్‌అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలను ఆకస్మిక తనిఖీ

రేగొండ: మండలంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయం, మహాత్మజ్యోతిబాపూలే గురుకుల పాఠశాలను సోమవారం మండల ప్రత్యేక అధికారి శామ్యుల్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన పాఠశాలలో భోజనం, తాగునీరు, వంటగది, క్లాస్‌రూమ్స్, టాయిలెట్స్‌ను పరిశీలించారు. మెనూ అమలుపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు.

మరమ్మతులు చేపట్టాలి

నాలుగు రోజుల నుంచి కురుస్తున్న భారీ వర్షాలకు జమ్‌షెడ్‌బేగ్‌పేట బ్రిడ్జి వద్ద ఏర్పాటు చేసిన తాత్కాలిక రోడ్డు కోతకు గురైంది. దీంతో రేగొండ నుంచి కొత్తపల్లిగోరికి రాకపోకలు నిలిచిపోయాయి. కాగా కోతకు గురైన రోడ్డును మండల ప్రత్యేక అధికారి శామ్యుల్ పరిశీలించారు. కోతకు గురైన రోడ్డుకు మరమ్మతులు వెంటనే చేపట్టాలని గుత్తేదారును ఆదేశించారు. ఎంపీడీఓ వెంకటేశ్వరరావు, ఎంపీఓ రాంప్రసాదరావు, కార్యదర్శులు ఉన్నారు.

గంజాయి తరలిస్తే కఠిన చర్యలు



స్నిఫర్ డాగ్‌తో తనిఖీ చేస్తున్న పోలీసులు

కన్నాయిగూడెం: మండలంలో గంజాయి, రవాణా చేసినా, సేవించిన కఠిన చర్యలు తప్పవని ఎస్సై ఇనుగుల వెంకటేష్ అన్నారు. మండంలోని వివిధ ప్రాంతాల్లో స్నిఫర్ డాగ్‌తో విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ పక్కనే ఉన్న ఛతీస్‌గఢ్ నుంచి గంజాయి క్రయ విక్రయాలు జరుగుతున్నట్లు సమాచారం ఉన్నందున మండలంలో తనిఖీలు చేస్తున్నట్లు వారు తెలిపారు. అలాంటి సంఘటనలకు ఎవరైనా పూనుకుంటే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. గంజాయి వలన యువత పాడైపోతారన్నారు. గంజాయి అమ్మకాలు జరిపినా, రవాణా చేసినా వెంటనే పోలీసులకు తెలపాలని ఎస్సై వెంకటేశ్ సూచించారు

సెల్ టవర్‌కు సిగ్నల్స్ అమర్చాలి

ఏటూరునాగారం: మారుమూల ఏజెన్సీ గ్రామం, వరద ముంపు ప్రాంతమైన కొండాయి గ్రామంలో ఏర్పాటు చేసిన సెల్‌టవర్‌కు సిగ్నల్స్ బూస్టర్లను అమర్చాలని అంబేడ్కర్ విగ్రహ ప్రతిష్ఠాపన కమిటీ చైర్మన్ పరికి ప్రసాద్ కోరారు. సోమవారం మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడుతూ ఐదునెలల క్రితం ఈ గ్రామంలో సెల్‌టవర్‌ను బీఎస్ఎన్ఎల్ వారు ఏర్పాటు చేసి ఎలాంటి బూస్టర్లను అమర్చలేదన్నారు. ఒక వైపు వర్షాలు, మరో వైపు వరదలతో కొండాయి, మల్యాల, గోవిందరాజుల కాలనీల ప్రజలు బిక్కు బిక్కుమంటూ కాలం గడుపుతున్నారు. గత ఏడాది వచ్చిన వరదలకు 8 మంది వరదల్లో చిక్కుకు పోగా అప్పుడు కూడా ఎలాంటి సిగ్నల్స్ లేకపోవడం వల్లనే వారి ప్రాణాలు గాలిలో కలిసిపోయాయన్నారు. వరదబాధితులకు సహాయం అందించడంలో గత బీఆర్ఎస్ ప్రభుత్వం విఫలమైందన్నారు. ఈ ప్రభుత్వం స్పందించి రక్షణ కల్పించాలని కోరారు. భిక్షపతి, నర్సింగరావు, సాంబయ్య, రవీందర్, పాల్గొన్నారు.